
బయ్యారం : తడిసిన వరి మెదలను చూపుతున్న రైతు వెంకన్న


మహబూబాబాద్ మండలం బలరాం తండాలో తడిసిన వడ్లను చూపుతున్న రైతు


వేశాలపల్లిలో వడ్ల కుప్పలపై టార్పాలిన్ షీట్లు


ములుగు రూరల్ : కొత్తూరులో వరద నీటి వరి పొలం


కురవి : తాట్యీతండాలో నేలపై పడిన మిర్చి తోట


నెల్లికుదురు మండలం వావిలాలలో నేలవాలిన మక్కజొన్న చేను


మంగపేట : ఆరబోసిన ధాన్యంపై నిలిచిన వరద


మంగపేట : దొంగలొర్రె సమీపంలో మిరప చేనులో నిలిచిన నీళ్లు


ములుగు రూరల్ : పంచోత్కులపల్లిలో నేలవాలిన మిర్చి తోట


బయ్యారం : వర్షానికి తడిసిన వరి మెదలు


ములుగులో తడిసిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో ఎత్తిన రైతులు


భూపాలపల్లి మండలం గొర్లవీడులో ఈదురుగాలులకు నేలవాలిన వరి

# ఆరుగాలం కష్టం వర్షార్పణం

**తుఫాన్ ప్రభావంతో నీటి మునిగిన పంటలు**

**ములుగు, మానుకోట జిల్లాల్లో ఎక్కువ నష్టం**

- నేలవాలిన వరి, మిర్చి, మక్కజొన్న, పత్తి చేలు
- పలుచోట్ల కల్లాలను ముంచెత్తిన వరద
- అకాల వానతో ఆగమవుతున్న రైతులు
- చల్లని గాలులతో వణుకు మొదలు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచనలు

*రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చే వేళ నీటిపాలైంది. కోతకు వచ్చిన వరి, కల్లాల్లో ఉన్న ధాన్యంతో పాటు మిర్చి చేన్లను అకాల వర్షం ముంచెత్తింది. మిగ్‌జాం ప్రభావంతో బుధవారం ఉమ్మడి జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బ తినగా ములుగు, మానుకోట జిల్లాల్లో ఎక్కువ నష్టం వాటిల్లింది. ముసురుకు తోడు చల్లని ఈదురుగాలులు వీస్తుండడంతో వణుకు మొదలైంది. వర్షానికి పలుచోట్ల వాగుల్లోకి వరద వచ్చి చేరుతుండడంతో అప్రమత్తంగా ఉండాలని అధికారయంత్రాంగం సూచనలు చేస్తోంది.* - నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, డిసెంబర్ 6


నర్సంపేట : మార్కెట్‌లో ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్ షీట్లు


ములుగులో..


బయ్యారం : ఈదురుగాలులకు నేలరాలిన మిర్చి పంట


బయ్యారం : కట్టుగూడెంలో నేలవాలిన వరి


మహబూబాబాద్ మండలం ఆమనగల్‌లో తడిసిన వరి


బయ్యారం : నేలవాలిన వరిని పరిశీలిస్తున్న ఏఈ రాంజీ, ఏఈవో సురేశ్


నర్సింహులపేట : బీల్యాతండాలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న మహిళా రైతు

మిగ్‌జాం తుఫాన్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్ర ప్రభావం చూపింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం, ఈదురుగాలులతో ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో ఎక్కువగా పంట నష్టం జరిగింది. వరి, మిర్చి, మక్కజొన్న, పత్తి పంటలు నీట మునగడం, మొక్కలు వాలిపోవడం సహా ధాన్యం తడిసిముద్దవడంతో అన్నదాత ఆగమయ్యాడు. వరి పంటలు చేతికి వచ్చే సమయంలో కురిసిన వర్షాల కారణంగా వేలాది ఎకరాల్లో వరి పంటలు నీటి పాలయ్యాయి. ములుగు జిల్లాలో గోదావరి తీర ప్రాంతాల వెంబడి ఉన్న మండలాల్లో రైతులు ఎక్కువగా మిర్చి పంట సాగు చేయగా అవి వరద ప్రభావానికి నీట మునిగాయి. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. చాలాచోట్ల వరి మెదలు తడిసి ముద్దయ్యాయి. వరికోత కోసి కల్లాల్లో వడ్లను ఆరబెడుతున్న రైతులు వాటిని కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. వర్షానికి తడవకుండా వేసిన టార్పాలిన్ షీట్లు, పరదాలు కప్పినప్పటికీ గాలికి అవి కొట్టుకుపోవడంతో ధాన్యంలో నీరు నిలిచింది. ఏటూరునాగారం మండలంలో కురిసిన వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు నడుములోతు వాగులో నుంచి నడుచుకుంటూ దాటి పాఠశాలలకు చేరుకున్నారు. తుఫాన్ ప్రభావంతో జిల్లా యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేసి రక్షణ చర్యలను చేపట్టింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పూర్తి స్థాయిలో అధికారులు ధాన్యాన్ని కొనుగోలు చేసే ప్రక్రియను ప్రారంభించలేదు. దీంతో కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం వర్షానికి తడువకుండా కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. మహబూబాబాద్ జిల్లాలోని మహబూబాబాద్, నర్సింహులపేట, చిన్నగూడూరు, బయ్యారం, కురవి, డోర్నకల్, నెల్లికుదురు, దంతాలపల్లి, గార్ల మండలాల్లో ఎక్కువగా పంట నష్టం జరిగింది. వర్షానికి గార్ల మండలంలోని రాంపురం పాకాల ఏటి వద్ద వరద ఉధృతిని ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్ బుధవారం పరిశీలించి గార్ల, రాంపురం, మద్దివంచ, కొత్త తండా సహా చుట్టు పక్క గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిపివేయాలని పోలీసు అధికారులను సూచించారు. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా తక్షణం స్పందించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు. గడిచిన 24గంటల్లో ములుగు జిల్లాలో 57 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా వెంకటాపురం మండలంలో అత్యధికంగా 71 మి.మీ వర్షం కురిసింది. అలాగే మహబూబాబాద్‌లో 49.6 మి.మీ, వరంగల్ జిల్లాలో 24.04 మి.మీ., భూపాలపల్లి జిల్లాలో 9.3 మి.మీ., హనుమకొండ జిల్లాలో 9.3 మి.మీ సగటు వర్షపాతం నమోదు కాగా ఆత్మకూర్ మండలంలో అత్యధికంగా 17.4 మిల్లీమీటర్లు వర్షం పడింది. దీనికి తోడు చలిగాలులు వీస్తుండడంతో ప్రజలు చలికి గజగజ వణుకుతున్నారు. అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.